దేశవ్యాప్తంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ పోటీ


మాట్లాడుతున్న ఐపీసీ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శ్రీధర్

సుల్తాన్‌బజార్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా తమ పార్టీ పోటీ చేస్తుందని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ (ఐపీసీ) పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కేబీ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన ఎస్ఆర్ఐ కొప్పర్ల పద్మకర్ (ఐస్వాక్), నర్రి స్వామి కురుమలను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ దుయలక్ష్మితో కలిసి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ.. తమ పార్టీ అధికారంలోకి వస్తే మాతృ పరిపాలన, మాతృ ప్రేమతో పరిపాలన, ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం దేశం మొత్తం సంపూర్ణ మద్యపాన నిషేధం, మత సామరస్యాన్ని పాటిస్తూ.. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించడం తదితర పంచ సూత్రాలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ 25 పార్లమెంట్ స్థానాలు, దేశవ్యాప్తంగా 100 పార్లమెంట్ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు. పార్టీ నాయకులు నందికొండల్‌రావు, నవీన్, వాసుదేవరావు, శ్రీనివాస్, భాస్కర్, స్టీఫెన్, గణేష్, అల్లాజి, అంజనీదేవి, శివ పావని, సుజాత, సరిత, సమతక్క తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తాం



గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయనున్నట్లు మంత్రి సీతక్క అన్నారు. గురువారం రవీంద్రభారతిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఆడపిల్లలపై ఎలాంటి వ్యత్యాసం లేకుండా పెంచాలని, అప్పుడే వారు ఉన్నత లక్ష్యాలను సాధిస్తారన్నారు. ఇటీవల కాలంలో చాలా మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పౌష్టికాహార లోపం వల్ల ఈ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నర్సరీ క్లాసులను కూడా ప్రారంభిస్తామన్నారు. నగరంలో వలస కూలీలు ఉండే ప్రాంతాల్లో అంగన్‌వాడీ మొబైల్ క్యాంటీన్లను ఏర్పాటు చేసి వారి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించి వారికి రూ.లక్ష నగదును అందజేశారు. అంతకుముందు దివ్యాంగురాలైన కళాకారిణి భాగ్యతో కలిసి మంత్రి డ్యాన్స్ చేయడం ఆహూతులను ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ శైలజ, మహిళాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళానికి తెలంగాణ ప్రభుత్వం 'శక్తి టీమ్' పురస్కారాన్ని అందజేసింది.

నేడు ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి సముచిత ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ఇఫ్తార్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని అందుకే మొదటి శుక్రవారం రోజున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్‌విందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖకు ప్రభుత్వం రూ.2263 కోట్ల బడ్జెట్‌లో కేటాయించిందని మూడు నెలల్లో రూ.478.56 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

కల్తీ మిరియాలు స్వాధీనం.. కేసు నమోదు

అబిడ్స్: కల్తీ మిరియాలు విక్రయిస్తున్న దుకాణంపై ఈస్ట్‌జోన్, షాహినాయత్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పెద్దఎత్తున కల్తీ మిరియాలను స్వాధీనం చేసుకున్నారు. బొప్పాయి గింజలతో పలు రకాల కెమికల్స్ కలిపి కల్తీ మిరియాలు తయారు చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి దాదాపు రూ.4 లక్షల విలువ చేసే కల్తీ మిరియాలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాల్ ఓ ప్రకటనలో తెలిపారు. బేగంబజార్ జోషివాడికి చెందిన వినోద్‌కుమార్ గెహ్లాట్ (లియాస్ వినోద్ గెహ్లాట్) బేగంబజార్ ఫిష్‌మార్కెట్ సమీపంలో వినోద్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో నిర్వహిస్తున్న దుకాణంలో పెద్ద ఎత్తున కల్తీ మిరియాలు విక్రయిస్తున్నాడు. గురువారం పోలీసులు దాడులు నిర్వహించి వినోద్‌కుమార్ గెహ్లాట్‌ను అదుపులోకి తీసుకున్నారు. దుకాణంలో కల్తీ మిరియాలతో పాటు 700 కిలోల మిరియాలను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన మిరియాలను తీసుకొచ్చి అందులో బొప్పాయి గింజలు కలిపి కల్తీ మిరియాలు తయారు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడిపై ఐపీసీ 420, 336, 272, 273 పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్ పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్, సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్‌లు పాల్గొన్నారు.

నకిలీ కాస్మోటిక్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

అబిడ్స్: నకిలీ కాస్మోటిక్ వస్తువులు విక్రయిస్తున్న దుకాణంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున కాస్మోటిక్స్‌ను స్వాధీనం చేసుకుని యజమానిని అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన బేగంబజార్ ప్రముఖ వాణిజ్య కేంద్రంలో పాతబస్తీ యాకత్‌పురాకు చెందిన తాబీర్ అహ్మద్ లాస్కర్ (37) ఈ నకిలీ విక్రయాలు కొనసాగిస్తున్నాడు. సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి దాదాపు రూ.4.17 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాల్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం పోలీసులు జరిపిన దాడుల్లో ఈ నకిలీ కాస్మోటిక్ పలురకాల వస్తువులు సీజ్ చేసి యజమానిని అరెస్టు చేసి విచారించామన్నారు. ముంబాయి నుంచి తీసుకొచ్చి బేగంబజార్‌లో విక్రయిస్తున్నట్లు అతడు పోలీసుల విచారణలో తేలింది. కాగా ఈ నకిలీ ఉత్పత్తులు చాలా హానికరమైనవని, వీటిని ఉపయోగించడం ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసును షాహినాయత్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్, ఈస్ట్‌జోన్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్‌లు పాల్గొన్నారు.

పరామర్శ

అఫ్జల్‌గంజ్: నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆందోళనకు దిగిన అశోక్ అకాడమీ చైర్మన్ అశోక్ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడిని పరామర్శించేందుకు గురువారం నిరుద్యోగులు ఉస్మానియాకు చేరుకున్నారు. వారి తరఫున ఇద్దరు ప్రతినిధులను మాత్రమే ఉస్మానియా వర్గాలు వార్డులోకి అనుమతించారు. ఈ సందర్భంగా కొందరు నిరుద్యోగులు మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ.. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. ఇప్పటికి వరకు కార్యాచరణ ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు వెంటనే ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీ సాయి చంద్ర ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, దివ్యాంగులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నాగేశ్వరరావు, గిన్నిస్‌బుక్ రికార్డు గ్రహీత ఏఎస్‌రావు, నిర్వాహకులు దాసరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'హైదరాబాద్ ఎంపీ స్థానం బీజేపీ కైవసం'


బీజేపీ అభ్యర్థి మాధవిలతను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని బీజేపీ పార్టీ కైవసం చేసుకుంటుందని బీజేపీ జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ దీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవిలతను కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని ఈసారి బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. ప్రజలు ఇప్పటికైనా ధర్మాన్ని గెలిపించాలని అని అభ్యర్థించారు. బీజేపీ నేతలు శైలేందర్‌యాదవ్, నవీన్ బండారి తదితరులున్నారు.

వ్యర్థాలతో పరేషానీ !


గుడిమల్కాపూర్ మార్కెట్ ఎదుట ఇలా..

- గుడి మల్కాపూర్ మార్కెట్లలో అధ్వానంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు, రైతులు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లో పారిశుద్ధ్య పనులు అటకెక్కాయి. గుడిమల్కాపూర్ మార్కెట్ రోడ్డు, తాళ్లగడ్డ రోడ్డు, గుడిమల్కాపూర్ చౌరస్తా నుంచి మెహిదీపట్నం వెళ్లే రోడ్లపై ఎటుచూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో రోడ్లు, డివైడర్ల వద్ద చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ప్రధాన రహదారుల మధ్య చెత్త కుప్పలు ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

గుడిమల్కాపూర్ మార్కెట్ వద్ద..

అత్యంత రద్దీగా ఉండే గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్, పూల మార్కెట్ ఉదయం సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు రద్దీగా ఉంటాయి. శివారు ప్రాంతాల నుంచి రైతులు కూరగాయలు, పూల వాహనాలతో మార్కెట్లకు వస్తారు. అయితే ఈ చెత్త కుప్పలతో ప్రధాన రహదారులు ఇరుకుగా మారి ట్రాఫిక్ జామ్ అవుతుంది.

గుట్టలుగా కుళ్లిన కూరగాయలు..

లక్ష్మీనగర్ నుంచి గుడిమల్కాపూర్ పూలమార్కెట్ ముందు నుంచి గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తాకు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో పాటు చెత్త నుంచి కుళ్లిన వాసన వస్తుండటంతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇదిలా ఉండగా గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో సైతం ప్రహరీ గోడల పొడవునా కుళ్లిన కూరగాయలు గుట్టలుగా పడి ఉంటున్నాయి.


లక్ష్మీనగర్ చౌరస్తా గోల్డెన్ ప్యాలెస్ రోడ్డుపై..

రాష్ట్రంలోనే అతి పెద్దది..

రాష్ట్రంలోనే పెద్దదైన గుడిమల్కాపూర్ పూలమార్కెట్‌లో సైతం వాడిపోయిన పూలగుట్టలు గుట్టలుగా పడి ఉంటున్నాయి. గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా నుంచి తాళ్లగడ్డవైపు వెళ్లే మెయిన్ రోడ్డు పక్కన చెత్తకుప్పలు రోజులు గడిచినా కూడా తరలించకుండా అలాగే ఉండిపోతున్నాయి.

పత్తాలేని నాయకులు..

గుడిమల్కాపూర్ డివిజన్‌కు కార్పొరేటర్ లేడు. ఇక్కడ కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవర కరుణాకర్ గతేడాది మృతి చెందారు. ఈ కారణంగా అధికారులను పనుల విషయమై అడిగే నాథుడే కరువయ్యాడు. ఇతర పార్టీల నాయకులు కూడా పారిశుద్ధ్య పనులను పట్టించుకోవడం లేదు. దీంతో పారిశుద్ధ్య అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతుంది. గుడిమల్కాపూర్‌లో ఎన్ని పారిశుద్ధ్య యూనిట్లు ఉన్నాయో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది.

ఎదురెదురుగా రెండు మార్కెట్లు..

రాష్ట్రంలోనే అతిపెద్దదైన పూలమార్కెట్ నగరంలోని మార్కెట్లలో పెద్దదైనా గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లు రెండు ఎదురెదురుగా ఉన్నాయి. ఈ మార్కెట్ల ప్రధాన గేట్ల ముందే చెత్తకుప్పలు పేరుకుపోయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వాటర్‌బోర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


ఎండీ సుదర్శన్‌రెడ్డికి మెమోరాండం అందజేసిన రాంబాబు తదితరులు

అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డులో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మెట్రో వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డికి వాటర్‌బోర్డు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి జయరాజులతో కూడిన బృందం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగులు ఎదుర్కొంటున్న అఫ్లేషన్ సమస్యను పరిష్కరించాలన్నారు. సరెండర్ లీవ్‌లపై కూడా ఉద్యోగులకు సానుకూలంగా సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకు సమ్మర్ క్యాంప్ సీపీఎస్‌ను వెంటనే మంజూరు చేయాలని ఎండీకి విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. దీనిపై ఎంప్లాయిస్ యూనియన్ తరఫున వారు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా బర్త్ సర్టిఫికెట్

చాంద్రాయణగుట్ట: నిబంధనలకు విరుద్ధంగా బర్త్ సర్టిఫికెట్‌ను జారీచేసిన జీహెచ్ఎంసీ సీనియర్ అసిస్టెంట్‌ను చాంద్రాయణగుట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీహెచ్ఎంసీలోని బర్త్, డెత్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సత్యనారాయణ నిబంధనలను పాటించకుండా మీ సేవా నిర్వాహకులతో కలిసి అక్రమంగా బర్త్ సర్టిఫికెట్‌ను జారీ చేశాడు. దీనిపై విచారణ జరిపిన జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు అతడిని సస్పెండ్ చేశారు. సర్కిల్-10 ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఉస్మానియా ఆస్పత్రి ప్రొఫెసర్‌కు సత్కారం



అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉస్మానియా ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ మనీషా సాహెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ యూనియన్ పలు రంగాల్లో ప్రావీణ్యం పొందిన వారిని అభినందించారు. డాక్టర్ మనీషా సాహె మాట్లాడుతూ.. టీఎన్జీఓస్ యూనియన్ తనను సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పెద్ద ఎత్తున ఉస్మానియా ఆస్పత్రి డాక్టర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు చేరువ


పదోతరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండ నయాఖిలాలోని ఉర్వా హైస్కూల్‌లో పదోతరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో అనుకున్నది సాధించ గలుగుతామన్నారు. విద్యార్థుల జీవితంలో పదోతరగతి మొదటి మెట్టు అని ఈ మెట్టు దాటితే విజయాలు వాటంతట అవే మీ ముంగిట వాలుతాయన్నారు. తాను ఉపాధ్యాయుల సూచనలను పాటించే ఉన్నత చదువుల్లో సైతం మొదటి ర్యాంకు సాధించానన్నారు. ఫలితంగా ప్రజలకు సేవచేసే అవకాశం గల పోలీసు ఉద్యోగం వచ్చిందన్నారు. చదువులో విజయానికి కావాల్సింది మానసిక ధృడత్వమని, నేడు బాలుర కంటే బాలికలే అన్ని పరీక్షల్లో ముందుంటున్నారన్నారు. వారికి పోటీగా బాలురు సైతం ఉత్తమ ర్యాంకులు సాధించే ప్రయత్నం చేయాలన్నారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సొసైటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి, గోల్కొండ జగదాంబిక మహంకాళి వృత్తిపని సంఘం అధ్యక్షులు సాయిబాబాచారి, ఉర్వా హైస్కూల్ అకడమిక్ హెడ్ సమీనాతన్వీర్ తదితరులున్నారు.

పీఆర్సీ నివేదిక అందజేత


కమిషనర్‌కు నివేదికను సమర్పిస్తున్న గద్దం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

నాంపల్లి: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గద్దం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ నేతృత్వంలో ఉద్యోగుల ప్రతినిధి బృందం గురువారం బీఆర్‌కే భవన్‌లో నూతన పీఆర్సీ కమిషనర్ ఎస్.శివశంకర్‌ను కలిసి పీఆర్సీ నివేదికను సమర్పించారు. వేతన సవరణ, ఫిట్‌మెంట్, సీపీఎస్ విధానం రద్దు, ఇంటిఅద్దె, రిటైర్డ్‌మెంట్ గ్రాట్యుటీ పెంపు, అడ్వాన్సులు, ఓడీ వంటి అంశాలతో కూడిన ప్రతిపాదన నివేదికను అందజేశారు. నిర్ణీత గడువులోగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని కోరారు. సంఘం నేతలు ఖాదర్ బిన్ హసన్, ధన్‌రాజ్, శ్రీనివాస్‌లతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ ఆధ్వర్యంలో తాను నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్వాన్, గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్ల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. డ్రైనేజీ సమస్య, తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు చేయగా.. సానుకూలంగా స్పందించిన ఆయన తాగునీటికి ఎలాంటి కొరత లేదని అధికారులు కూడా తాగునీటి సరఫరాపై కోతలు విధించడం లేదన్నారు. వేసవిలో నీటి కోతలు విధించొద్దని తాను జలమండలి అధికారులను కోరానన్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో లోప్రెజర్ సమస్య ఉందని, దీనిని కూడా పరిష్కరిస్తున్నామన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం జలమండలి ఆపరేషన్స్ డైరెక్టర్ విజయరావును కలిశారు. తాగునీటి సమస్య, పైపులైన్స్, కొత్త లైన్ల ఏర్పాటు తదితర వాటిపై చర్చించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సరఫరా అయ్యే తాగునీరు మాత్రం అంతే ఉంటుందన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. దీన్నివల్ల ప్రజల తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంటుందన్నారు. లంగర్‌హౌజ్, కార్వాన్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం వేసిన పైపులు మార్చి కొత్తవాటిని వేయాల్సి ఉందన్నారు. పాతపైపులైన్లు పగిలి తాగునీరు రోడ్లపై వృధాగా పారుతుందన్నారు. నియోజకవర్గంలో రంజాన్ నెలలో తాగునీరు నిర్దేశించిన మోతాదులో అందించాలని ఆయన కోరారు. సాంకేతిక ఇబ్బందులు ఏర్పడితే వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

అబిడ్స్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్, గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన జీవన్ రామారావు (26), కర్ణాటక బీదర్‌కు చెందిన ఆనంద్ భీమ్‌సింగ్ జాదవ్ (27)లు ఇన్నోవా కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజుల ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పిల్లర్ నెంబర్ 54 ప్రాంతంలో ఇన్నోవా వాహనాన్ని తనిఖీ చేయగా.. భారీ ఎత్తున గంజాయిని బయటపడింది. దీని విలువ రూ.13.80 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. నిందితులతో పాటు కారు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు కేసును గుడిమల్కాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి మక్కా మసీదులో యౌముల్ ఖురాన్ సభలు

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చారిత్రాత్మకమైన మక్కా మసీదులో రానున్న ఐదు శుక్రవారాల పాటు యౌముల్ ఖురాన్ సభను నిర్వహించనున్నట్లు మక్కా మసీదు నిర్వాహకులు ప్రకటించారు. దీనిలో భాగంగానే ఈనెల 15న చారిత్రాత్మకమైన మక్కా మసీదులో తొలి శుక్రవారం ఆలిండియా మజ్లిస్-ఇ-ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) ఆధ్వర్యంలో జల్సా-ఇ-యౌముల్ ఖురాన్ సభ ఉంటుందన్నారు. 22న రెండో శుక్రవారం ఆలిండియా సున్నీ ఉలామా బోర్డు ఆధ్వర్యంలో, 29న మజ్లిస్ బచావ్ తెహ్రీక్ (ఎంబీటీ) ఆధ్వర్యంలో, ఏప్రిల్ 5 న ఆలిండియా మజ్లిస్-ఇ-ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ సభలు ఉంటాయన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం


న్యూ బోయిగూడ డి క్లాస్ కమిటీ సభ్యులతో కిషన్‌రెడ్డి

నాంపల్లి: మల్లేపల్లి డి క్లాస్ క్వార్టర్స్‌లో ఓపెన్ జిమ్ సెంటర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం న్యూ బోయిగూడ డి క్లాస్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులను గురువారం కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కేంద్ర మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మల్లేపల్లి డివిజన్ అధ్యక్షుడు జగన్నాథరాజ్, న్యూ బోయిగూడ డి క్లాస్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వంశీ బాలకృష్ణ పాల్గొన్నారు.

గోల్కొండ ఆస్పత్రిలో వరల్డ్ కిడ్నీ డే


సిబ్బందితో కలిసి కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ మహ్మద్ మజహరుల్లా

గోల్కొండ: శరీరంలో కిడ్నీలు అత్యంత ప్రధానమైనవని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. గురువారం ఆస్పత్రిలో వరల్డ్ కిడ్నీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తోటి వైద్యులు, సిబ్బందితో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన కిడ్నీల ప్రాధాన్యం వాటి పనితీరును వివరించారు. కిడ్నీలు శరీరంలో గుండె తర్వాత అత్యంత ప్రధానమైనదని అన్నారు. కిడ్నీ పాడైతే శరీరంలోని ఇతర అంగాలు కూడా క్రమేపి దెబ్బతింటాయన్నారు. కిడ్నీల పరిరక్షణ కోసం తరచూ వైద్యులను కలుస్తుండాలన్నారు. వీపు కిందిభాగంలో నొప్పి, మూత్ర సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి


బీఎస్పీ రాజ్యసభ ఎంపీ రామ్‌జీ గౌతంను సన్మానిస్తున్న దృశ్యం


చార్మినార్: గెలుపోటములు సహజమని.. అంతమాత్రానా తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహం చెందాల్సిన అవసరం లేదని బీఎస్పీ రాజ్యసభ ఎంపీ రామ్‌జీ గౌతం తమకు చెప్పారని బీఎస్పీ నగర అధ్యక్షులు మూల రామ్‌చరణ్‌దాస్ తెలిపారు. గురువారం బీఎస్పీ కార్యాలయానికి వచ్చిన రామ్‌జీ గౌతంను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. నగరంలో బహుజన సమాజ్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరింత ఉత్సాహంగా పనిచేయాల్సిన అవసరం ఉందనే విషయాన్ని తమకు ఆయన వివరించారన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి చిరంజీవి, ఉపాధ్యక్షుడు బంగారి మానిక్‌రావు, రాకేష్ తదితరులున్నారు.

కేలండర్ ఆవిష్కరణ



సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో ప్రజలందరికీ ఆరోగ్య భద్రతను కల్పిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధికారులు రూపొందించిన డైరీ, కేలండర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యారోగ్యశాఖలోని ఉద్యోగులు ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ శాఖలో గెజిటెడ్ అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇలాంటి డైరీ, కేలండర్లు ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సంఘం అధ్యక్షుడు కలిముద్దీన్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, కోశాధికారి చంద్రశేఖర్‌రావు, నాయకులు నర్సింహ్మారెడ్డి, మంజుల, విజయనిర్మల, రాజ్‌కుమార్, మురళీధర్‌రెడ్డి తదితరులున్నారు.

ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా నరేంద్రకుమార్


శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర వైద్యుల సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నరేంద్రకుమార్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పీజీడీఏ నాయకులు డాక్టర్ రమేష్, ప్రవీణ్, అజ్మీర రంగ తదితరులు పాల్గొన్నారు.